క్లుప్తంగా

నెమ్మదిగా ప్రారంభమై.. జోరందుకున్న మార్కెట్ వేలం



వేలం నిర్వహిస్తున్న అధికారులు

మందస: మేజరు పంచాయతీ మందస మార్కెట్ వేలం పాట రసవత్తరంగా శనివారం జరిగింది. సర్పంచ్ చెరుకుపల్లి యల్లమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన వేలం ప్రక్రియకు పలువురు కాంట్రాక్టర్లు హాజరయ్యారు. తొలుత మెల్లగా పాట ప్రారంభమై.. తరువాత జోరందుకుంది. రూ.వేల నుంచి రూ.లక్షల్లోకి మారింది. ఒకానొక దశలో కాంట్రాక్టర్లు సిండికేట్‌గా మారడానికి ప్రయత్నించగా.. అధికారులు వారి ప్రయత్నాన్ని నిలువరించగలిగారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి రూ.3 లక్షలకు పైగా నిర్ణయించినప్పటికీ, రూ.5.80 లక్షలకు గుడ్ల నాగరాజు దక్కించుకున్నారు. ఆదాయం పెరగడంతో అధికారులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఇప్పిలి వెంకటరమణ, ఈవో ఏవీ సత్యన్నారాయణ, పంచాయతీ సిబ్బంది బమ్మిడి నవీన్‌కుమార్, రెల్ల లక్ష్మీనారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు సీహెచ్ లక్ష్మణమూర్తి, యర్రగుంట్ల కృష్ణ మోహన్, పొందర దుదిష్టి పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

సోంపేట: ఇసుకలపాలెం గ్రామంలో హెల్ప్ ఏజ్ ఇండియా ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. ఆరోగ్యవరం కంటి ఆస్పత్రి సౌజన్యంతో నిర్వహించిన శిబిరంలో 50 మంది పరీక్షలు చేయించుకున్నారు. వీరిలో 12 మందికి కంటి అద్దాలు, పది మందికి శస్త్ర చికిత్స అవసరమని వైద్యులు గుర్తించారు. కార్యక్రమంలో వైద్య సహాయకులు ఆర్.శివ, వైఎస్సార్‌సీపీ నాయకుడు బి.ఈశ్వరరావు, ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సూచిక బోర్డు ఏర్పాటు

ఇచ్ఛాపురం రూరల్: ఆంధ్రా–ఒడిశా సరిహద్దు ఇచ్ఛాపురం పట్టణ ముఖ ద్వారం 16వ నంబర్ జాతీయ రహదారిపై సీఐ ఆర్.ఈశ్వరచంద్ర ప్రసాద్ సరిహద్దు, పట్టణ గుర్తింపు సూచిక బోర్డును శనివారం ప్రారంభించారు. ఎలియన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఇచ్ఛాపురం దక్షిణ ముఖ ద్వారం వద్ద బోర్డు ఏర్పాటు చేయడం ద్వారా ఇతర ప్రాంతాలు, రాష్ట్రేతర ప్రజలు సులువుగా గుర్తిస్తారన్నారు. క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు లోపింటి నర్సింహమూర్తి, తిప్పన లక్ష్మణరెడ్డి, పట్టణ ఎస్సై కె.గోవిందరావు, హెడ్ కానిస్టేబుల్ తెలుకల రామారావు, పీఆర్‌ఓ దక్కత గోపీనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

‘ఆ ప్రచారంలో వాస్తవం లేదు’




మాట్లాడుతున్న నాయకులు

కాశీబుగ్గ: చినంచల పంచాయతీ పరిధిలో ధాన్యం కొనుగోలుగాక వర్షానికి తడిచి ముద్దవుతున్నాయని కొంతమంది చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదని వైఎస్సార్‌సీపీ గ్రామ ఇన్‌చార్జి కంచారన భాస్కర్, సర్పంచ్ సుజాత స్పష్టం చేశారు. చినంచల సచివాలయం వద్ద విలేకరులతో శనివారం మాట్లాడారు. తప్పుడు ప్రచారం చేయడం మానుకోవాలని హితవు పలికారు. రాష్ట్ర మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు సహకారంతో పంచాయతీలో సచివాలయం, ఆర్‌బీకే, వెల్‌నెస్‌సెంటర్, వైఎస్సార్ హెల్త్ క్లినిక్, వీరరామచంద్రపురం గ్రామానికి రూ.కోటిన్నరతో రోడ్డు ఏర్పాటు చేశామన్నారు. పంచాయతీలో సుమారు రూ.3 కోట్లుతో అభివృద్ధి పనులు జరిగితే విమర్శించడానికి అవకాశం లేక ధాన్యం పేరుతో తప్పుడు ప్రచారం చేయడం తగదన్నారు. మాజీ సర్పంచ్ అరియాపల్లి దేవానంద్, మండల కో–ఆప్షన్ సభ్యుడు పొట్నూరు జోగారావు, వీఆర్వో చంద్రమోహన్, పంచాయతీ కార్యదర్శి సుధాకర్, సచివాలయం వ్యవసాయ అసిస్టెంట్ ప్రశాంత్, ఆర్‌బీకే వలంటీర్ కంచరాన కిరణ్ పాల్గొన్నారు.

22న లలిత కళారంజని వార్షికోత్సవం

కాశీబుగ్గ: పట్టణానికి చెందిన లలిత కళారంజని 32వ వార్షికోత్సవాన్ని ఈ నెల 22వ తేదీ సాయంత్రం కాశీబుగ్గ హైస్కూల్ ఆవరణలో నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని సంస్థ అధ్యక్షుడు కొత్తపల్లి చిన్నారి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 160వ కార్యక్రమంలో భాగంగా.. శోభాకృత్ నామ సంవత్సర ఉగాది వసంతోత్సవాన్ని పురస్కరించుకుని ‘వాయిదాల పెళ్లి’ హాస్య నాటికను ప్రదర్శించనున్నట్టు పేర్కొన్నారు.

గేట్‌లో రాకేష్‌కు 108వ ర్యాంకు



నందిగాం: నరేంద్రపురం పంచాయతీ నారాయణపురం గ్రామానికి చెందిన కవిటి రాకేష్ గేట్ ప్రవేశ పరీక్షలో 108వ ర్యాంకు సాధించాడు. ఈయన తండ్రి రాము ఇండియన్ ఆర్మీలో సబ్‌మేజర్‌గా పని వేసి ఉద్యోగ విరమణ పొందగా, తల్లి ఉష గృహిణి. రాకేష్ పదో తరగతి పలాసలో, ఇంటర్‌ను విశాఖలో చదివాడు. ఏయూలో కెమికల్ ఇంజినీరింగ్ పూర్తి చేశాడు. రాకేష్‌ను అతని మేనమామ, కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ అభినందించారు.

నేత్రపర్వంగా..



డిగొనపపుట్టుగలో అభయాంజనేయస్వామి విగ్రహప్రతిష్ట కార్యక్రమం శనివారం నేత్రపర్వంగా జరిగింది. రామాలయం వద్ద హనుమంతుని విగ్రహం ప్రతిష్ఠించాలని పండితులు చేసిన సూచన మేరకు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బదకల భాస్కరరావు కుటుంబసభ్యుల ఆర్థికసాయంతో విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. వేదపండితులు సంతోష్‌పాఢి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. బెందాళం జయప్రకాష్,జల్లు యుగంధర్, గ్రామపెద్దలు పాల్గొన్నారు. –కవిటి

శాస్త్రోక్తంగా..



ఇచ్ఛాపురం గ్రామదేవత స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయంలో పునఃప్రతిష్ట కావించబడిన కృష్ణశిలా విగ్రహం నాలుగో వార్షికోత్సవాన్ని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు శాస్త్రోక్తంగా శనివారం నిర్వహించారు. అమ్మవారి విగ్రహానికి ఉదయం ప్రత్యేక అభిషేకాలు జరిజగాయి. అలాగే ఆలయంలోని తూర్పు సింహద్వారం, హనుమాన్ దేవాలయం ప్రతిష్ట కూడా జరిగింది. అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. –ఇచ్ఛాపురం

గాత్ర కచేరీ..



బొడ్డఖాళీ వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద శనివారం గాయనీమనులు డబ్బీరు లక్ష్మి, లక్కోజీ జీవితలు నిర్వహించిన గాత్ర కచేరీ శోతల్ని ఆకట్టుకుంది. దొన్ను బెహరా తబల, బుగత జగన్‌ల సహకారం వాయిద్యాల మధ్య అన్నమయ్య, త్యాగరాజు కృతులను ఆలపించారు. కల్యాణ వేంకటేశ్వరునికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. –ఇచ్ఛాపురం రూరల్

రోడ్డుపై పేరుకు పోయిన ఇసుక!

- ప్రమాదానికి గురౌతున్న వాహనదారులు



సగం రోడ్డు కప్పేసిన ఇసుక (ఇన్‌సెట్‌లో) రైల్వే గేటు సమీపంలో పేరుకుపోయిన ఇసుక

టెక్కలి రూరల్: టెక్కలి పాత ఎన్‌హెచ్–5 రహదారిపై ఇసుక పేరుకుపోయింది. దీంతో అదుపు తప్పి ప్రమాదాలకు గురవుతున్నామని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఆర్టీసీ డిపో వద్దగల ర్యాంపు నుంచి సుమారు ఒక కిలోమీటర్ మేర రోడ్డు ఇసుకతో నిండిపోయింది. అలాగే తెంబూర్ రోడ్డులో రైల్వే గేటు సమీపంలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. వేగంగా వచ్చే వాహనదారులు ఇసుక కారణంగా ఈ రెండుచోట్ల అదుపు తప్పి పడిపోతూ ప్రమాదాలకు గురువుతున్నారు. దీనికితోడు బస్సులు, లారీల్లాంటి పెద్ద వాహనాలు వెళ్లే సమయంలో ఇసుక ఎగిరి వెనుక వచ్చే ద్విచక్ర వాహనదారుల కళ్లల్లో పడుతుండడంతో ఇబ్బందులకు గురౌతున్నారు. ర్యాంపుల నుంచి ఇసుకను తీసుకెళ్లే వాహనాలపై కనీసం టార్పాలిన్లు కప్పడం లేదు. దీంతో రోడ్లపై ఇసుక పడిపోయి గుట్టలుగా ఉండిపోతుంది.

ఇంతజరుగుతున్నా అధికారులు ఎవ్వరూ పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్లపై పేరుకుపోయిన ఇసుకను తొలగించేయాల చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అలాగే ఇసుక తరలించే సమయంలో టార్పాలిన్లు కట్టేలా వాహనదారులను ఆదేశించాలని సూచిస్తున్నారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం తగదు



సచివాలయ ఉద్యోగుల పనితీరును పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి. లాఠకర్

- జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్
- సచివాలయ ఉద్యోగులపై ఆగ్రహం

కవిటి: సచివాలయ ఉద్యోగులు విధినిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే భారీమూల్యం చెల్లించుకోవాల్సి వస్తోందని జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి. లాఠకర్ హెచ్చరించారు. ఆర్.బెలగాం గ్రామసచివాలయాన్ని శనివారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా సచివాలయ పరిసరాల్లో అపరిశుభ్ర పరిస్థితులపై కార్యదర్శి మోహనరావును ప్రశ్నించగా సరైనరీతిలో స్పందించలేదు. దీంతో అతనిపై తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే పలువురు సచివాలయ ఉద్యోగులు వారికి విధుల్లో భాగంగా ఇచ్చిన గ్రామస్థాయి తనిఖీలు చేయకపోవడం పట్ల మండిపడ్డారు. ప్రభుత్వం ఆశించిన లక్ష్యాలను చేరుకోలేని పరిస్థితులకు ఏ ఉద్యోగి కారణమైనా వారిని ఉపేక్షించేది లేదన్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్ యాప్‌ల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన తీరుపై తీవ్రంగా అసహనం వ్యక్తంచేశారు. ఈ సమస్యపై కవిటి ఎంఈఓ ధనంజయమజ్జికి వారంరోజుల్లో వాస్తవ వివరాలతో ఇంజినీరింగ్ అసిస్టెంట్‌పై నివేదిక సమర్పించాలన్నారు. తహసీల్దార్ అప్పలరాజు, ఎంపీడీవో సూర్యనారాయణ, పీఆర్ ఇంజినీర్ ప్రవీణ్‌కుమార్ ఉన్నారు.

సీహెచ్‌సీ తనిఖీ

కవిటి సీహెచ్‌సీలో ఇటీవల డయాలసిస్ కేంద్రానికి అనుబంధంగా నిర్వహణ చేసేందుకు ఉద్దేశించిన డయాలసిస్ కంటైనర్‌ను కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు. ఈ మేరకు ఇక్కడ సేవలు అందించేందుకు ఉన్న సాధ్యాసాధ్యాలపై స్థానిక డయాలసిస్ కేంద్రం వైద్యులు, అధికారులు, సిబ్బందితో చర్చించారు. డయాలసిస్ రోగులకు అందుతున్న సేవలపై తహసీల్దార్ అప్పలరాజు, ఎంపీడీవో సూర్యనారాయణలను అడిగి తెలుసుకున్నారు.

రాజీపడటమే రాజమార్గం

- లోక్‌అదాలత్‌లో జూనియర్ సివిల్ జడ్జి రవిశంకర్



టెక్కలి: కేసులు పరిష్కరిస్తున్న జడ్జి టి.హరిత



కాశీబుగ్గ: లోక్‌అదాలత్ నిర్వహిస్తున్న జడ్జి రవిశంకర్

కాశీబుగ్గ: రాజీపడటమే రాజమార్గమని పలాస జూనియర్ సివిల్ జడ్జి పి.రవిశంకర్ అన్నారు. స్థానిక జూనియర్ సివిల్ కోర్టులో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో కక్షిదారులనుద్దేశించి మాట్లాడారు. లోక్ అదాలత్ ద్వారా కేసులను పరిష్కరించుకోవాలన్నారు. మొత్తం ఆరు కేసులు పరిష్కారమయ్యాయి. వీటిలో ఒక కేసుకు రూ.45 వేలు అపరాద రుసుం వసూలు చేయగా, మూడు కేసులు రాజీపడ్డాయి. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు తాండ్ర మురళి, కార్యదర్శి పిండి వెంకటరావు, సుధారాణి, వివేకానంద, పట్నాయక్, సీసీ నారాయణ పాల్గొన్నారు.

11 కేసులు పరిష్కారం

టెక్కలి: టెక్కలి సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో నిర్వహించిన లోక్ అదాలత్‌లో 11 కేసులు పరిష్కారమయ్యాయి. సీనియర్ సివిల్ జడ్జి టి.హరిత నేతృత్వంలో రూ.97 లక్షల లావాదేవీలకు చెందిన మొత్తం 11 కేసులను పరిష్కరించారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి మల్లా తేజా చక్రవర్తి, సభ్యులు కె.ఈశ్వరరావు, ఐ.మల్లేష్, డి.రాజేశ్వరరావు, డి.వివేకానందా, పి.బాబూరావు, ఎస్.ఎస్.రాజు, పి.ఆనంద్, పి.సాయిరాజు పాల్గొన్నారు.

నిబంధనల మేరకు ధాన్యం కొనుగోలు

- సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి



రైతులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి

కోటబొమ్మాళి: ప్రభుత్వ నిబంధనల మేరకు రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేస్తామని టెక్కలి సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు. కొంత మంది రైతుల ఫిర్యాదు మేరకు కోటబొమ్మాళి 1, 2 రైతుభరోసా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం పరిశీలించారు. తమ ధాన్యాన్ని ఇప్పటికే మిల్లులకు పంపామని..వాటిని కొనుగోలు చేయాలని పలువురు రైతులు సబ్ కలెక్టర్‌ను కోరారు. దీనికి ఆయన స్పందిస్తూ నిబంధనల ప్రకారం గ్రామాల్లోఉన్న ధాన్యాన్ని మాత్రమే ఆర్‌బీకేల ద్వారా సేకరిస్తామని స్పష్టం చేశారు. 1, 2 ఆర్‌బీకేల్లో అదనంగా 250 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం అవకాశం ఇచ్చిందని.. ఆ మేరకు సేకరించాలని అగ్రికల్ అసిస్టెంట్లు జి.లావణ్య, బి.దివ్యలను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ శివరామక్రిష్ణ, వీఆర్వో పి.అఖిల్ ఉన్నారు.

చేయి చేయి కలిపి.. రోడ్డు నిర్మించుకున్నారు



పనులు ప్రారంభిస్తున్న ఆనందరావు

కాశీబుగ్గ: చేయి చేయి కలిపి రోడ్డును నిర్మించుకున్నారు. ఇది పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని 19వవార్డు లేబరుకాలనీ మంకినమ్మ దేవాలయం సమీపంలో ఉన్నటువంటి వీధిలో చోటుచేసుకుంది. పలాస మండలం కేదారిపురం పంచాయతీ సర్పంచ్ ధనుంజయ సహకారానికి వీధి వాసులు తోడయ్యారు. రోడ్డు నిర్మాణానికి వీలుగా జేసీబీతో చదునుచేశారు. అనంతరం కంకరను ట్రాక్టర్‌లతో తీసుకువచ్చి రోడ్డును వేసుకున్నారు. వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి అంబటి ఆనందరావు పనులను శనివారం ప్రారంభించారు. స్థానికులు, కేదారిపురం సర్పంచ్ ముందుకు వచ్చి కంకరరోడ్డు వేసుకోవడం అభినందనీయమన్నారు. వచ్చే నెల బడ్జెట్‌లో సీసీ రోడ్డు వేయడానికి ప్రతిపాదనలు పెడతామన్నారు. మంత్రి, చైర్మన్‌ల దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో కేదారిపురం సర్పంచ్ ధనుంజయ, టి.కృష్ణారావు పాల్గొన్నారు.

సక్రమంగా పని చేయని వలంటీర్లపై చర్యలు

- ఎంపీపీ, ఎంపీడీవో స్పష్టీకరణ



మాట్లాడుతున్న ఎంపీపీ డొక్కరి దానయ్య

మందస: సక్రమంగా పని చేయని గ్రామ వలంటీర్లపై చర్యలు తీసుకుంటామని ఎంపీపీ డొక్కరి దానయ్య, ఎంపీడీవో వాయలపల్లి తిరుమలరావు స్పష్టం చేశారు. మండలాభివృద్ధి కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో వలంటీర్ల పనితీరుపై చర్చించారు. వలంటీర్లు అందుబాటులో ఉండడంలేదని, కొంతమంది ఇతర ప్రాంతాల్లో ఉంటున్నారని పలువురు పంచాయతీ కార్యదర్శులు సమాచారం ఇవ్వడంతో అత్యవసరంగా సమావేశం ఏర్పాటు చేశారు. ఫీవర్ సర్వే ఉండడంతో వలంటీర్ల ఫింగర్‌ప్రింట్ సర్వేకు కావాల్సి ఉందన్నారు. అందుబాటులో లేని వలంటీర్ల పరిధిలో సర్వేకు ఆటంకం కలుగుతోందన్నారు. కొన్ని ప్రభుత్వ పథకాలు సంబంధించి కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయని సచివాలయం సిబ్బంది ఎంపీపీ దానయ్య, ఎంపీడీవో తిరుమలరావు దృష్టికి తీసుకువచ్చారు. వారంలో మూడు రోజుల పాటు సంబంధిత సచివాలయాల్లో వలంటీర్లు బయోమెట్రిక్ వేయాల్సి ఉందన్నారు. దీనిపై ఎంపీపీ దానయ్య స్పందిస్తూ.. పని చేయని, అందుబాటులో లేని వలంటీర్లపై చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా గౌరవ వేతనం కూడా నిలిపి వేయాలన్నారు. ప్రభుత్వం ఎంతో మంచి లక్ష్యంతో ఈ వ్యవస్థను ఏర్పాటు చేసిందని, పని చేయని వలంటీర్లు అవసరం లేదన్నారు. సమావేశంలో పంచాయతీరాజ్ విస్తరణాధికారి ఇప్పిలి వెంకటరమణ, మందస ఈవో అన్నెపు వెంకట సత్యన్నారాయణ ఉన్నారు.

ఎమ్మెల్సీ ‘నర్తు’కు ఘనస్వాగతం పలకండి

కవిటి: ఎమ్మెల్సీగా విజయం సాధించి తొలిసారిగా నియోజకవర్గానికి ఆదివారం వస్తున్న నర్తు రామారావుకు ఘన స్వాగతం పలకాలని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ పార్టీ శ్రేణులను కోరారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడదల చేశారు. మధ్యాహ్నం 2.30 గంటలకు కొర్లాం జంక్షన్‌కు చేరుకోనున్న రామారావు బారువ, సోంపేట, కంచిలి మీదుగా కొత్తపుట్టుగకు వస్తారని పేర్కొన్నారు. పార్టీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నేతలంతా ఈ కార్యక్రమంలో పాల్గొనాలన్నారు.

కిడ్నీ బాధితునికి ఆర్థిక సాయం



సాయం అందజేస్తున్న సేవా సమితి సభ్యులు

ఇచ్ఛాపురం రూరల్: కేశుపురం గ్రామానికి చెందిన ప్రశాంత్ శెట్టి మూత్రపిండాల వ్యాధితో బాధపడుతున్నాడు. ఆర్థిక ఇబ్బందితో బాధపడుతున్నట్టు తెలుసుకున్న అదే గ్రామానికి చెందిన కాళీమాత సేవా సమితి సభ్యులు రూ. పది వేలు సేకరించారు. ఈ మొత్తంతోపాటు నెలకు సరిపడే నిత్యావసర సరుకులను బాధితుడికి శనివారం అందజేసి ఔదర్యాన్ని చాటుకున్నారు.

ఆల్బెండజోల్ మాత్రలతో నులిపురుగుల నివారణ



మాట్లాడుతున్న లక్ష్మీతులసి

సంతబొమ్మాళి: పాఠశాలల్లో చదువుతున్న అధికశాతం మంది విద్యార్థుల్లో ఎనిమియా (రక్తహీనత)కు కారణం నులిపురుగులేనని టెక్కలి డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ లక్ష్మీతులసి అన్నారు. వీటిని అరికట్టేందుకు ప్రతిఒక్కరూ ఆల్బెండజోల్ మాత్రలు తప్పని సరిగా వేసుకోవాలని సూచించారు. సంతబొమ్మాళి, దండుగోపాలపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శనివారం నిర్వహించిన నులిపురుగుల మాత్రల మాపప్ కార్యక్రమంలో అమె పాల్గొన్నారు. ఈ సందర్భం మాట్లాడుతూ.. నులిపురుగుల వలన పిల్లలలో శారీరక ఎదుగుదల తగ్గుట, బుద్ధిమాంద్యం, రక్తహీనత మొదలగునవి వచ్చే అవకాశం ఉందన్నారు. సంతబొమ్మాళి వైద్యాధికారిణి డాక్టర్ సంధ్యారాణి, దండుగోపాలపురం వైద్యాధికారి డాక్టర్ అజయ్‌కుమార్, డిప్యూటీ పారామెడికల్ అధికారి వాన సురేష్‌కుమార్, ఆరోగ్య విస్తరణ అధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

భూసర్వే ప్రారంభం

కంచిలి: గోకర్ణపురం సచివాలయం పరిధిలో సమగ్ర భూ సర్వే ప్రక్రియ శనివారం ప్రారంభమయ్యింది. అత్యాధునిక పరికరాలతో మండల సర్వేయర్ నాగేశ్వరరావు తన సిబ్బందితో సర్వే చేపట్టారు. స్థానిక సర్పంచ్ యారడి ఆనందరావు సహకరించారు.

నేడు వాహనాల వేలం

కాశీబుగ్గ: వివిధ ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన మూడు ద్విచక్ర వాహనాలకు ఆదివారం ఉదయం వేలం నిర్వహించనున్నట్టు కాశీబుగ్గ పోలీసు స్టేషన్ హౌస్ ఆఫీసర్ జి.శ్రీనివాసరావు శనివారం తెలిపారు. ఆసక్తి ఉన్నవారు వేలంలో పాల్గొనాలని సూచించారు.

పరిశోధనలపై దృష్టి సారించాలి

- జేఎన్‌టీయూ ప్రొఫెసర్ చంద్రశేఖర్‌రెడ్డి



చంద్రశేఖర్‌రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

టెక్కలి: మారుతున్న కాలానికి అనుగుణంగా పరిశ్రమల అభివృద్ధికి అవసరమైన అంశాలపై విస్తృతంగా పరిశోధనలు చేయాలని విజయనగరం జేఎన్‌టీయూ ప్రొఫెసర్ ఎస్.చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. ‘ఫ్రేమ్ వర్క్ ఫర్ రీసెర్చ్ ప్రొఫెషనల్ ప్రాక్టీసెస్ అండ్ ర్యాంకింగ్ క్రైటీరియం’అనే అంశంపై టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో అధ్యాపకులకు శనివారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పది మందికి ఉపాధి కల్పించే పరిశ్రమలను మరింత విస్తరించే విధంగా వాటిపై పరిశోధనలు చేయాలన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతికతను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం చంద్రశేఖర్‌రెడ్డిని కళాశాల యాజమాన్య ప్రతినిధులు సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల డైరక్టర్ వి.వి.నాగేశ్వరరావు, శిక్షణ కన్వీనర్ దుప్పల ఆజాద్, ఆర్‌అండ్‌డీ డైరెక్టర్ కె.బి.మధుసాహు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

పీహెచ్‌సీలో సౌకర్యాల కల్పనకు చర్యలు



మాట్లాడుతున్న శ్రీరామమూర్తి

నందిగాం: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పూర్తిస్థాయిలో మౌలిక సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్టు అభివృద్ధి కమిటీ చైర్మన్, ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి చెప్పారు. పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.చలమయ్య అధ్యక్షతన ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోగులకు మెరుగైన సేవలు అందించి ప్రజల మన్ననలు పొందాలని సిబ్బందికి సూచించారు. కేంద్రం పరిధిలోని గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించాలన్నారు. అనంతరం నాడు–నేడు పథకంలో భాగంగా రూ.58 లక్షలతో చేస్తున్న మరమ్మతులను పరిశీలించారు. ఎంపీడీవో హెచ్‌వీ రమణమూర్తి, ఇన్‌చార్జి తహసీల్దార్ భాగ్యలక్ష్మి, నాయకులు జడ్యాడ జయరాం, సిబ్బంది పాల్గొన్నారు.

అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

ఇచ్ఛాపురం: పురపాలక సంఘం పరిధిలో స్వచ్ఛోత్సవ అవార్డుల కోసం మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్ శనివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపారు. మహిళా దినోత్సవం సందర్భంగా పురపాలక సంఘం కార్యాలయంలో నిర్వహించిన స్వచ్ఛోత్సవ కార్యక్రమంలో ప్రతిభ చూపిన మహిళలకు జూన్ ఐదో తేదీన నిర్వహించనున్న ప్రపంచ పర్యావరణ దినోత్సవం రోజున అవార్డులు ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 22వ తేదీలోగా మెప్మా కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

ఆటంకం లేకుండా బిల్లుల చెల్లింపు

కాశీబుగ్గ: జగనన్న కాలనీలో గృహాలు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు ఆటంకం లేకుండా ప్రభుత్వం బిల్లులు చెల్లిస్తోందని మున్సిపల్ చైర్మన్ బళ్ల గిరిబాబు అన్నారు. రామక్రిష్ణాపురం రెవెన్యూ పరిధిలో జోగి సతీష్ నిర్మించుకున్న గృహ ప్రవేశ కార్యక్రమం శనివారం జరిగింది. దీనికి హాజరైన ఆయన మాట్లాడుతూ.. లబ్ధిదారులందరూ సకాలంలో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోవాలన్నారు. వైస్ చైర్మన్లు బొర క్రిష్ణారావు, మీసాల సురేష్‌బాబు, ప్రభుత్వ విప్ శంకర్‌పండా పాల్గొన్నారు.

గ్రామాల్లో ఫీవర్ సర్వే చేయాలి

మందస: వైద్య సిబ్బంది గ్రామాల్లో వైద్య సేవలను సక్రమంగా అందివ్వాలని, జ్వరాలతో బాధ పడేవారిని గుర్తించాలని మందస ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు మద్దిల సంపత్‌రావు, టి.శైలజ అన్నారు. మందస పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్తలతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సిబ్బంది గ్రామాల్లో పర్యటించి ఫీవర్ సర్వే చేయాలన్నారు. హెల్త్ ఎడ్యుకేటర్ డి.మంగమ్మ, ఫార్మసిస్టు టి.లీలారాణి, పీహెచ్‌ఎన్ ఎస్.పెంటమ్మ, స్టాఫ్ నర్స్ వెంకటలక్ష్మి, ఎల్టీలు వై.నాగరాజు, ఎస్.ప్రేమ, ఏఎన్‌ఎంలు అన్నపూర్ణ, పుష్పాబెహరా పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

వజ్రపుకొత్తూరు రూరల్: చిరుధాన్యాలతో తయారు చేసే ఆహారాన్ని తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఎఫ్‌పీవో సీసీ ఆర్.హైమావతి అన్నారు. బాతుపురంలో శనివారం చిరుధాన్యల మహోత్సవ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా చిరుధాన్యలు, వాటి ప్రముఖ్యత, ప్రయోజనాలపై మహిళలకు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ చేపట్టారు.

ప్రకృతి వ్యవసాయంతో ప్రయోజనం

కంచిలి: ప్రకృతి వ్యవసాయ విధానంతో రైతుకు మంచి ప్రయోజనాలున్నాయని సంబంధిత సబ్‌డివిజన్ యాంకర్ యశోద, మండల యాంకర్ శివానందం అన్నారు. అంపురం గ్రామంలో కూరగాయల పంటలకు సామూహికంగా అగ్నాస్త్రం తయారు చేయడం, దీని ఉపయోగాలపై రైతులకు శనివారం అవగాహన కల్పించారు. ఉపసర్పంచ్ కేశవరావు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

నందిగాం: బాల్య వివాహాలను అరికట్టాలని నందిగాం ఏఎస్సై వై.మురళి అన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో చైల్డ్ లైన్ పలాస సబ్‌సెంటర్ సిబ్బంది ఆధ్వర్యంలో బాలికలకు వివిధ అంశాలపై అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆధునిక సమాజంలో బాలికలు అన్ని రంగాల్లో రాణిస్తున్నప్పటికీ.. కొన్ని చోట్ల వారు ఇబ్బందులు పడుతున్నారన్నారు. చైల్డ్‌లైన్ కోఆర్డినేటర్ శివాజీ, ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వై.హరిబాబు పాల్గొన్నారు.

మంచినీటి సమస్య పరిష్కారం

కాశీబుగ్గ: మున్సిపాలిటీ పరిధి 22వార్డు పెద్దవీధిలో మంచినీటి సమస్యను మున్సిపల్ తాగునీటి విభాగం అధికారులు పరిష్కరించారు. వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి లోకనాథ్ బెహరా సమస్యను మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించే స్పందన కార్యక్రమంలో వినతిపత్రం అందించారు. దీంతో సిబ్బంది శనివారం వచ్చి పాడైన బోరు బావులను బాగు చేశారు.